
10 YEAR ANNIVERSARY 2014 - 2024
# పెన్ పవర్
తెలంగాణ రౌండప్
ఆదివారం 29 డిసెంబర్ 2024 పేజీలు 8




2031 హెచ్ఎండిఏ మాస్టర్ ప్లాన్లో
214 ప్రభుత్వ భూమి..

# కబ్జాల కదన రంగంలో..!
# కాంగ్రెస్ నాయకుల ఆరంగేట్రం..?

- గాగిల్లాపూర్ సర్వే నెంబర్ 213, 214 ప్రభుత్వ భూమిలో అక్రమంగా గోడౌన్ నిర్మాణం..
- 1500 గజాలు ఆక్రమించి 10 రోజులుగా అక్రమ నిర్మాణ పనులు..
- ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకై "హైడ్రాను" అమలు చేసిన కాంగ్రెస్..! కబ్జాలు ప్రోత్సహిస్తుందా..?
- ఓ కాంగ్రెస్ నాయకుని ఈ కబ్జా వెనుక..! కంటెస్టెడ్ ఎమ్మెల్యే అండ ఉన్నట్టు సమాచారం..
- అధికారులు చర్యలు తీసుకోకపోతే..! హైడ్రాకు ఫిర్యాదు చేస్తామని ఆకుల సతీష్ హెచ్చరిక..


గాగిల్లాపూర్ 214 ప్రభుత్వ భూమిలో ఆకుల సతీష్ ఆధ్వర్యంలో కబ్జాల పరిశీలన..

దుండిగల్ రెవెన్యూ వ్యవస్థ తీరు అత్యంత దయనీయంగా తయారైంది.. కబ్జాదారులకు సహకరించడానికే ఈ వ్యవస్థను నియమించారా..? అనే సందేహాన్ని కలిగిస్తుంది..!ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆపార్టీ ప్రముఖులు, బడానేతల మెప్పు పొందడానికి, విధులు తాకట్టు పెట్టి కబ్జాదారులకు సహకరిస్తున్నారనేది నగ్నసత్యం..! ఈ వ్యవహారంలో వేలకోట్లు విలువచేసే ప్రభుత్వ ఆస్తులను అప్పణంగా కట్టబెట్టేందుకే అధికారులు మొగ్గుచూపుతున్నారని దుండిగల్ మండలంలో కోకొల్లలు.. గాగిల్లాపూర్ సర్వే నెంబర్ 214 ప్రభుత్వ భూమి ఖాళీ స్థలాల్లో 2017-18 లోనే అపట్టి తహశీల్దార్ ఆదేశాల మేరకు ఆర్ఐ ఆధ్వర్యంలో సుమారు 10 రెవెన్యూ హెచ్చరిక బోర్డులని గతంలోనే ఏర్పాటు చేసినప్పటికీ..! అప్పటి బీఆర్ఎస్ నేతల సిఫార్సులతో బోర్డులు తొలగించి కబ్జాలకు పాల్పడ్డారు.. తాజాగా ఇప్పుడు కాంగ్రెస్ నేతల అండతో సుమారు 1500 గజాల్లో భారీ గోడౌన్ నిర్మాణానికి ఓ కాంగ్రెస్ నేత అండ ఉందని ఆకుల సతీష్ శనివారం ఓ ప్రకటనలో ఆరోపించారు..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, డిసెంబర్ 28:

-2లో

## తెలంగాణలో గిర్మాపూర్-యాదాద్రి ఆర్ఆర్ఆర్
## పనులకు టెండర్లు పిలిచిన కేంద్రం



- గిర్మాపూర్ నుంచి యాదాద్రి వరకు ఎక్స్‌ప్రెస్ రోడ్డు నిర్మాణం
- రెండేళ్లలో ఆర్ఆర్ఆర్ పూర్తి చేయాలన్న కేంద్రం
- నాలుగు విభాగాలుగా విభజించి టెండర్లు పిలిచిన కేంద్రం

-2 లో

## సాగు చేసే భూమికే పెట్టుబడి సాయం..

- రైతు భరోసాపై మంత్రి తుమ్మల నాగేశ్వర రావు కీలక వ్యాఖ్యలు!
- పెట్టుబడి సాయంపై స్పష్టత ఇచ్చే ప్రయత్నం చేసిన తుమ్మల
- సంక్రాంతి నుంచి ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్న మంత్రి
- సాగు విస్తీర్ణాన్ని రిమోట్ సెన్సింగ్ ద్వారా గుర్తించేలా ఆలోచన చేస్తున్నట్లు వెల్లడి

-3 లో



# కబ్జాల కదన రంగంలో..! కాంగ్రెస్ నాయకుల అరంగేట్రం..?




ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణ పనులు..

## పోటీలో గెలవకపోయినా..! ఆనేత సిఫార్సులలో దిట్టి..!

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ గండిమైసమ్మ మండలం గాగిల్లాపూర్ సర్వే నెంబర్ 214 ప్రభుత్వ భూమిలో కబ్జాదారులు సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసుకున్నారు.. లొసుగులు ఎక్కడ ఉన్నాయో తెలీదు కానీ..! హెచ్చరిక బోర్డులు తొలగించి మరీ కబ్జాలకు పాల్పడటం గమనార్హం.. ఏదిఏమైనప్పటికీ సర్వే నెంబర్ 214 పూర్తిగా కబ్జాదారుల ఆధీనంలోకి వెళ్ళినట్లు తెలుస్తుంది..! గాగిల్లాపూర్ సర్వే నెంబర్ 213 ప్రభుత్వ స్థలంలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు 2018 నుంచి అసంపూర్తిగా ఉండగా.. ఈ నిర్మాణాల పక్కనే ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిని, దాదాపు 1500 గజాలు ఆక్రమించుకొని, ఎలాంటి నిర్మాణ అనుమతులు లేకుండా..! భారీ కమర్షియల్ గోదాము నిర్మాణ పనులు గత 10 రోజులుగా చేపట్టడం గమనార్హం.. ఈ కబ్జా వ్యవహారంలో మున్సిపల్, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోక పోవడం పలు అనుమానాలకు తావిస్తోందని ఆకుల సతీష్ ఆరోపించారు.. ఈ కబ్జా వ్యవహారంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే సహకారంతో..! ఓ కాంగ్రెస్ నాయకుడు దర్జాగా నిర్మాణ పనులు చేస్తున్నట్లు సతీష్ ఆరోపించారు.. ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నప్పటికీ, అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విశేషం.. ఒకవైపు ప్రభుత్వ భూములు ,చెరువులు పార్కులు కాపాడుతామని ఆపరేషన్ హైడ్రా చైర్మన్ రేవంత్‌రెడ్డి చెప్తున్నప్పటికీ..! కాంగ్రెస్ నాయకులే ఈ విధంగా ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే..! చెప్పే మాటలకి, చేతలకి పొంతనలేదని ఆకుల సతీష్ విమర్శించారు.. అదేవిధంగా, డబుల్ బెడ్ రూమ్‌ల్లో ఉండే ప్రజలకు ఉపయోగపడాల్సిన ప్రభుత్వ భూమిని, కాంగ్రెస్ నాయకులు కబ్జా చేసుకుని ప్రజలకు ఏమి సందేశం ఇస్తారని ఆకుల సతీష్ ఎద్దేవా చేశారు. అధికారులు చర్యలు తీసుకోకుంటే హైడ్రాకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు..





గాగిల్లాపూర్ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల సముదాయం..

- మొదటి పేజి తరువాయి

ప్రభుత్వ భూముల పరిరక్షణలో రెవెన్యూ విభాగం విఫలమైందని గత బీఆర్ఎస్ హయాంలోనే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పింది అక్షరాల నిజమని స్పష్టమవుతుంది.. ఒకదశలో రెవెన్యూ వ్యవస్థను ఇతర శాఖలలో విలీనం చేస్తారనే వార్తలు కూడా వెల్లువెత్తాయి.. ఆ క్రమంలోనే ఉన్న విఆర్వోలు, విఆర్ఏ లను ఇతర శాఖలకు బదిలీ చేసిన సంగతి తెలిసిందే.. తహశీల్దార్ కార్యాలయం చుట్టూ కబ్జాలు జరుగుతున్నా..! అధికారులు మాత్రం అధికారపక్షం నేతల మెప్పు పొందటానికి వీలైనంత వరకు చర్యలకు దూరంగా ఉంటున్నారు.. ఇందులో అధికారుల స్వార్ధం లేకపోలేదు..! "తిలాపాపం తలాపిడికెడు" అన్న చందంగా సంబంధిత అధికారుల వాటా పిట్టలు కూడా మేయవు అని ఒక సమెత ఉండేది.. గండిమైసమ్మ సర్వే నెంబర్ 120 ప్రభుత్వ భూమిలో కబ్జాలు..! బహుదూర్‌పల్లి సర్వే నెంబర్ 227 ప్రభుత్వ భూమిలో రెవెన్యూ సహకార ధోరణి..! బహుదూర్‌పల్లి 131 ప్రభుత్వ భూమిని ప్రజాప్రతినిధి ఆక్రమించి ఎలాంటి ఎన్ఓసి, నిర్మాణ అనుమతులు లేకుండా దర్జాగా నిర్మాణాలు.. మల్లంపేట్ 170 ప్రభుత్వ భూమిలో బహిరంగంగానే రియల్ ఎస్టేట్ వ్యాపారం.. గాగిల్లాపూర్ సర్వే నెంబర్ 213, 214 ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డులు తొలగించి అక్రమ నిర్మాణాలు.. ఇవన్నీ స్థానిక అధికారులకు తెలియకుండా జరిగే అవకాశం ఉందా కలెక్టర్ సార్..



గాగిల్లాపూర్ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు..




# తెలంగాణలో గిర్మాపూర్-యాదాద్రి ఆర్ఆర్ఆర్ పనులకు టెండర్లు పిలిచిన కేంద్రం

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగంలో నాలుగు లైన్ల ఎక్స్‌ప్రెస్ రహదారి నిర్మాణ పనులకు కేంద్ర ప్రభుత్వం టెండర్లు పిలిచింది. గిర్మాపూర్ నుంచి యాదాద్రి వరకు ఎక్స్‌ప్రెస్ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు.మొత్తం నాలుగు విభాగాలుగా విభజించి రూ.5,555 కోట్లతో రోడ్డు నిర్మాణానికి టెండర్లను ఆహ్వానించారు. రెండేళ్లలో ఆర్ఆర్ఆర్ నిర్మాణం పూర్తి చేయాలని టెండర్ ఆహ్వాన నిబంధనల్లో స్పష్టం చేసింది.

ప్యాకేజీ 1లో భాగంగా సంగారెడ్డి జిల్లా గిర్మాపూర్ నుంచి రెడ్డిపల్లి వరకు 34.518 కిలోమీటర్లు, ప్యాకేజీ 2లో భాగంగా రెడ్డిపల్లి నుంచి ఇస్లాంపూర్ వరకు 26 కిలోమీటర్లు, ప్యాకేజీ 3లో భాగంగా ఇస్లాంపూర్ నుంచి ప్రజ్ఞాపూర్ వరకు 23 కిలోమీటర్లు, ప్యాకేజీ 4లో భాగంగా ప్రజ్ఞాపూర్ నుంచి యాదాద్రి జిల్లా రాయగిరి వరకు 43 కిలోమీటర్ల ఎక్స్‌ప్రెస్ రోడ్డు నిర్మాణ పనులకు కేంద్రం టెండర్లను పిలిచింది.

# ఎప్పుడేం మాట్లాడాలో తెలియదా అంటూ ఫ్యాన్స్ పై ఫైర్ అయిన పవన్ కళ్యాణ్ ..



హైదరాబాద్ పెన్ పవర్:టాలీవుడ్ స్టార్ హీరో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఈ మధ్య సినిమాలకి పూర్తిగా బ్రేక్ ఇచ్చి రాజకీయాలపై దృష్టి సారించాడు. కానీ ఫ్యాన్స్ మాత్రం పవన్ కళ్యాణ్ ఎక్కడికివెళ్ళినా సినిమా అప్డేట్లు అడుగుతూ ఇబ్బంది పెడుతన్నారు. అయితే పవన్ కళ్యాణ్ శనివారం గాలివీడు ఎంపీడీఓ శ్రీ జవహర్ బాబును పరామర్శించడానికి కాకినాడకి వెళ్ళాడు. ఈక్రమంలో మీడియా రిపోర్టర్స్ సీరియస్ మ్యాటర్స్ గురించి మాట్లాడుతుంటే సినిమా అప్డేట్స్ గురించి అడిగాడు. ఇక అభిమానులు కూడా ఓజీ.. ఓజీ.. ఓజీ... అంటూ నినాదాలు చేశారు. దీంతో పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ పై ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఎప్పుడేం స్లోగన్స్ ఇవ్వాలో తెలియదా అంటూ ఫైర్ అయ్యారు. సీరియస్ మ్యాటర్ గురించి మాట్లాడుతున్నప్పుడు సినిమాల గురించి అడుగుతారేంటీ అంటూ సీరియస్ అయ్యాడు. దీంతో ఈ వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. అయితే గతంలో కూడా పలుమార్లు బహిరంగసభల్లో రాజకీయాల గురించి ప్రసంగిస్తున్న సమయంలో పవన్ సినిమా పేర్లు పలుకుతూ హంగామా చేశారు. దీంతో అప్పుడు కూడా పవన్ ఏదో చూసీ చూడనట్టు వెళ్లిపోయారు. కానీ ఈమధ్య పవన్ బయట కనిపిస్తే చాలు సమస్యల గురించి కాకుండా సినిమా అప్డేట్లు అడుగుతున్నారు.

ఈ విషయం ఇలా ఉండగా ప్రస్తుతం పవన్ కళ్యాణ్ తెలుగులో ఓజీ, హరిహర వీరమల్లు, ఉస్తాద్ భగత్ సింగ్ 3 సినిమాల్లో నటిస్తున్నాడు. ఈ సినిమాల షూటింగ్ మొదలైన తర్వాత ఎన్నికలు రావడంతో పూర్తిగా రాజకీయాలకే సమయం కేటాయిస్తున్నాడు. కానీ అప్పుడప్పుడు సమయం తీసుకుని షూటింగ్ షెడ్యూల్స్ లో పాల్గొంటున్నప్పటికీ పూర్తీ స్థాయిలో సమయం ఇవ్వలేకపోతున్నాడు. దీంతో ఈ ఈ సినిమాల రిలీజ్ ఆలస్యం అవుతోంది.

# తెలుగు రాష్ట్రాల సీఎంలకు ఆర్ కృష్ణయ్య కీలక సూచన

**పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించేందుకు ఏపీ, తెలంగాణ సీఎంలు చొరవ తీసుకోవాలన్న కృష్ణయ్య**

**కేంద్రంలో బీసీ ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని వినతి**

**ఏపీ సీఎం చంద్రబాబు బీసీల దీర్ఘకాలిక డిమాండ్ల పరిష్కారానికి తోడ్పాటు అందించాలని విజ్ఞప్తి**



హైదరాబాద్ పెన్ పవర్:తెలుగు రాష్ట్రాల సీఎంలకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య కీలక సూచనలు చేశారు. ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీసీల డిమాండ్లపై హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో శుక్రవారం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ.. పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించేందుకు ఏపీ, తెలంగాణ సీఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డి చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బీసీలకు విద్య, ఉద్యోగ, ఆర్థికాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కేంద్రంలో బీసీ ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వంలో కీలకంగా ఉన్న ఏపీ సీఎం చంద్రబాబు బీసీల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరారు. బీసీల డిమాండ్ల సాధనకు జనవరి చివరి వారంలో ఆర్ కృష్ణయ్య అధ్యక్షతన అమరావతి వేదికగా బీసీల మహాసభ నిర్వహించనున్నట్లు ఏపీ బీసీ సంక్షేమ సంఘం ఇన్‌ఛార్జి నూకానమ్మ తెలిపారు. ఈ సమావేశంలో ఏపీ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగేశ్వరరావు యాదవ్, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు వెంకట కోటేశ్వరరావు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ గుజ్జ కృష్ణ తదితర నేతలు పాల్గొన్నారు.

## శుభకార్యాలకు వెళ్లినప్పుడు బొకేలకు బదులు ఇవి ఇవ్వండి: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



హైదరాబాద్ పెన్ పవర్:శుభకార్యాలకు వెళ్లినప్పుడు బొకేలకు బదులు మంచి పుస్తకాలు ఇవ్వాలని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సూచించారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన బుక్ ఫెయిర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పుస్తకాల్లో అనంతమైన జ్ఞానం ఉందన్నారు. పుస్తకాలను నమిలి మింగేసేంత క్షుణ్ణంగా చదవాలన్నారు. ఈ-బుక్స్ కంటే పుస్తకాల్లోనే మజా ఉంటుందని తెలిపారు.
పుస్తకాలు చదువుతుంటే రచయితతో నేరుగా మాట్లాడుతున్నట్లుగా ఉంటుందన్నారు. విశ్వం గురించి తెలియాలంటే పుస్తకాలు చదవాల్సిందేనన్నారు. నిరక్షరాస్యులకు ఆడియో బుక్స్ కూడా అందుబాటులోకి వచ్చాయని గుర్తు చేశారు. నేటి యువత పుస్తకాల వైపు మళ్లేలా పెద్దలు ప్రోత్సహించాలన్నారు. కాగా, హైదరాబాద్ బుక్ ఫెయిర్ రేపటితో ముగియనుంది.

## జగిత్యాల ఆసుపత్రిలో దారుణం

హైదరాబాద్ పెన్ పవర్:జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో దారుణం చోటుచేసుకుంది. గొల్లపల్లి మండలం రాఘవపట్నం గ్రామానికి చెందిన రాజనర్సు అనే వృద్ధుడు అనారోగ్యానికి గురి కావడంతో చికిత్స చేయించేందుకు వారం రోజుల క్రితం భార్య మల్లవ్వ జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించింది. అప్పటికే విరిగిన చేతికి బ్యాండేజ్ తో ఉన్న మల్లవ్వ భర్తకు అటెండెంట్ గా ఉంది. బీపీ కారణంగా అస్వస్థతకు గురైన మల్లవ్వ తన భర్త రాజనర్సుకు కేటాయించిన బెడ్ పై పడుకోగా ఆసుపత్రి సిబ్బంది పేషంట్ కు మాత్రమే కేటాయించిన బెడ్ అని విరిగిన చేయితో బాధపడుతున్న వృద్ధురాలు మల్లవ్వను వీల్ చైర్ లో తీసుకువచ్చి ఆసుపత్రి బయట ఉంచారు. ఆసుపత్రి బయట అచేతనావస్థతో వృద్ధులను గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వృద్ధులను తిరిగి ఆసుపత్రిలో చేర్పించారు. ఇటీవల ఆసుపత్రి సూపరింటిండెంట్ రాములు ను సరెండర్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినప్పటికీ జిల్లా ఆసుపత్రి యంత్రాంగం వైఖరి లో మార్పు రాకపోవడం పై విమర్శలు వెల్లువెత్తున్నాయి

## సాగు చేసే భూమికే పెట్టుబడి సాయం..

హైదరాబాద్ పెన్ పవర్:సాగు చేసే భూమికే పెట్టుబడి సాయం ఇవ్వాలనేది తమ ప్రభుత్వం ఉద్దేశమని, ఈ పథకం అమలులో కచ్చితత్వం కోసం ఉపగ్రహ డేటాను వినియోగించబోతున్నట్లు తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఆయన రైతు భరోసాపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సంక్రాంతి నుంచి రైతు భరోసాను ప్రారంభించేందుకు అవసరమైన చర్యలను చేపడుతున్నట్లు చెప్పారు. రైతు భరోసా పథకం అమలులో కచ్చితత్వం కోసం ఉపగ్రహ డేటను వినియోగిస్తామన్నారు. గ్రామాల్లో సర్వే నెంబర్ల వారీగా సాగు వివరాలను సేకరిస్తున్నట్లు చెప్పారు.సాగు చేస్తున్న రైతుల పేర్లను వ్యవసాయాధికారులు నమోదు చేస్తున్నట్లు చెప్పారు. రిమోట్ సెన్సింగ్ డేటా ఆధారంగా సాగు విస్తీర్ణాన్ని గుర్తించేలా ఆలోచన చేస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో సాగు విస్తీర్ణాన్ని అంచనా వేయగల కంపెనీల ప్రతినిధులతో ఆయన చర్చలు జరిపారు.

## రూ.11 వేల 650 కోట్ల అప్పు తీర్చిన వొడాఫోన్ గ్రూప్




**హైదరాబాద్ పెన్ పవర్:**వొడాఫోన్ ఐడియా షేర్లపై తీసుకున్న రుణాన్ని తిరిగి చెల్లించింది..వొడాఫోన్ గ్రూప్ 11వేల 650 కోట్లు బకాయిలను క్లియర్ చేసింది. శనివారం ( డిసెంబర్ 28) హెచ్ ఎస్ బీసీ కార్పొరేట్ ట్రస్టీ కంపెనీ ఈ వివరాలను విడుదల చేసింది.

రెగ్యులేటరీ ఫైలింగ్ ప్రకారం.. యూకె కు చెందిన వొడాఫోన్ గ్రూప్..దాదాపు 11వేల650 కోట్లు (1096 మిలియన్ పౌండ్లు) బకాయిలను క్లియర్ చేసింది. రుణదాతలకు సెక్యూరిటీ ట్రస్టీగా వ్యవహరిస్తున్న %ుూదీజ% కార్పొరేట్ ట్రస్టీ కంపెనీ (%ఖఖ%) లిమిటెడ్ లకు చెల్లించింది. వొడాఫోన్ గ్రూప్ రుణాన్ని పొందేందుకు %ఎ×ూ% లో దాదాపు తన మొత్తం వాటాను తాకట్టు పెట్టింది. శుక్రవారం నాటి స్టాక్ మార్కెట్ ముగిసే సమయాని వోడాఫోన్ ఐడియా షేరు ముగింపు ధర రూ.7.41.. షేర్ల విలువ దాదాపు రూ.11,649 కోట్లు. సెప్టెంబర్ 30, 2024 నాటికి వొడాఫోన్ కంపెనీ షేర్లలో వొడాఫోన్ గ్రూపునకు 22.56 శాతం వాటా ఉండగా ఆదిత్య బిర్లా గ్రూపునకు 14.76 శాతం వాటా ఉంది. ప్రభుత్వానికి 23.15 శాతం వాటా ఉంది.

## హైదరాబాద్‌లోని ఏపీ వాసులకు ఏపీఎస్ఆర్టీసీ గుడ్‌న్యూస్

**సంక్రాంతికి హైదరాబాద్ నుంచి ఏపీకి ప్రత్యేక బస్సులు**

**జనవరి 9 నుంచి 13 మధ్య 2,400 స్పెషల్ సర్వీసులు**

**అనదపు ఛార్జీలు లేకుండానే నిర్వహణ**

ప్రకటించిన ఏపీఎస్ఆర్టీసీ




**హైదరాబాద్ పెన్ పవర్:** సంక్రాంతి పండుగకు తెలంగాణ రాజధాని నగరం హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లే ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఏపీఎస్ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. జనవరి 9 నుంచి జనవరి 13 వరకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు ప్రకటించింది. హైదరాబాద్ నుంచి ఏపీలోని వివిధ ప్రాంతాలకు మొత్తం 2,400 స్పెషల్ బస్సులు నడపనున్నట్లు వెల్లడించింది.ఎలాంటి అదనపు ఛార్జీలు లేకుండానే ఈ ప్రత్యేక బస్సుల్లో ప్రయాణించవచ్చని స్పష్టం చేసింది. పండుగ వేళ ప్రజలపై ఖర్చుల భారాన్ని తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటనలో అధికారులు తెలిపారు. చిత్తూరు, నెల్లూరు, కర్నూలు, అనంతపురం, ఒంగోలు, మాచర్లతో పాటు వేర్వేరు ప్రదేశాలకు వెళ్లే సాధారణ బస్సులు, స్పెషల్ బస్సులు హైదరాబాద్ నగరంలోని ఎంజీబీఎస్‌కు ఎదురుగా ఉన్న సీబీఎస్ నుంచి బయలుదేరతాయని అధికారులు తెలిపారు.

# బియ్యంలోకి పురుగులు ఎందుకు వస్తాయి.. ఎలా తరిమికొట్టాలో తెలుసా..

**హైదరాబాద్ పెన్ పవర్:**కిచెన్ లో బియ్యం ఎంత కీలక పాత్ర పోషిస్తాయో వేరే చెప్పనక్కరలేదు. అలాంటి బియ్యానికి మాత్రం చాలా తక్కువ సమయంలోనే పురుగులు పట్టే అవకాశం ఉంది.వాటిని పదేపదే శుభ్రం చేసుకోవడం కూడా కష్టమే. అసలు వాటికి పురుగులే పట్టకుండా చూసుకుంటే ఎలాంటి సమస్యా ఉండదు కదా. బియ్యం లేదా పప్పులు కొని తెచ్చాక చిన్న చిట్కాలు పాటించడం ద్వారా వాటికి పురుగులు పట్టకుండా కాపాడుకోవచ్చు.

నిత్యావసర వస్తువుల్లో బియ్యం చాలా ముఖ్యమైనవి. ఇంట్లో ఏమి ఉన్నా.. ఏమి లేకపోయినా... బియ్యం ఉంటే చాలు.. కాస్తంత ఊరగాయ ముక్క వేసుకొని పొట్ట నింపుకోవచ్చు. అంటే కిచెన్ లో బియ్యం ఎంత కీలకమో వేరే చెప్పనక్కరలేదు. కోటి విద్యలు.. కూటి కొరకే అన్నారు పెద్దలు.. అలాంటి కూడును బియ్యంతోనే తయారు చేసుకోవాలి. అలాంటి వాటిలో పురుగులు చేరాయా ఇంకేముంది.. మన బాడీకి వచ్చే పోషకాలను అవి లాగేసుకుంటాయి. అంటే బియ్యంలో పురుగులు చేరకుండా చాలా జాగ్రత్తలు తీసుకోవాలి..అసలు బియ్యానికి ఎందుకంత త్వరగా పురుగులు పడతాయో తెలుసుకుంటే .. నివారణ మార్గాలు తెలుస్తాయి. బియ్యంలో పురుగులు నివసించడానికి అనువైన వాతావరణం ఉంటుంది. అందుకే చాలా రకాల పురుగులు కాపురం మొదలుపెట్టేస్తాయి. ఇక ఊరుకుంటాయా... పిల్లలు పెట్టి సంతతిని పెంచేస్తాయి. పొలాల్లో పంటలు కోసి ఆహార ప్రాసెసింగ్ కేంద్రానికి తీసుకెళ్లేటప్పుడు వాటిలో కొన్ని పురుగులు ఉండే అవకాశం ఉంది. ప్రాసెసింగ్ అంతా అయ్యాక బియ్యాన్ని మూటల్లో




కట్టి అమ్మేస్తారు. ఇక ఆ మూటలో ఒక్క పురుగు ఉన్న చాలు, అనువైన వాతావరణం రాగానే తమ జనాభాను పెంచే పనిలో ఉంటాయి. అలా బియ్యానికి పురుగులు అధికంగా పట్టేస్తాయి.

ఇంకా బియ్యానికి తడి తగిలినా బియ్యానికి పురుగు పట్టే అవకాశం ఉంది. అందుకే గాలి చొరబడని, తడి తగలని కంటైనర్లలో బియ్యాన్ని నిల్వ ఉంచుకోమని చెబుతారు. బియ్యంలో కొన్ని రకాల పదార్థాలు కలపడం ద్వారా పురుగులను నివారించవచ్చు.

**బిర్యానీ ఆకులు :** బియ్యాన్ని నిల్వ చేసే పాత్రలో ఆరేడు బిర్యానీ ఆకులను ఉంచండి. బియ్యం ఎక్కువ మొత్తంలో ఉంటే ఎక్కువ బిర్యానీ ఆకులను కలపండి. గాలి చొరబడకుండా బియ్యం మూటను కట్టేయండి.

లవంగాలు : బలమైన సువాసన గల ఈ సుగంధ ద్రవ్యాలు బియ్యానికి పురుగులు పట్టకుండా అడ్డుకుంటాయి.వంట గదిలో సూక్ష్మక్రిములు లేకుండా నివారించడంలో లవంగాలు ముందుంటాయి. లవంగం నూనెను స్ప్రే చేసినా కూడా పురుగులు పట్టవు.

**వెల్లుల్లి :** ప్రతి ఇంట్లో లభించే అత్యద్భుతమైన పదార్థం వెల్లుల్లి. దీన్ని పొట్టు తీశాక బియ్యంలో కలిపేయాలి. అలా బియ్యం వాడినంత కాలం వాటిని అలానే ఉంచుకోవచ్చు. పురుగులు వెల్లుల్లి ఉన్నచోట ఆ ఘాటుకు ఉండలేవు..

**వేపాకు :** బియ్యంలో పురుగులు చేరకుండా అద్భుతంగా పని చేస్తుంది వేపాకు. బియ్యాన్ని నిల్వ చేసుకునే డబ్బా అడుగు భాగాన వేపాకును ఉంచాలి. ఈ వేపాకుపై బియ్యం పోయాలి. ఇలా కాకుండా వేపాకుల పొడిని ఓ గుడ్డలో మూటలుగా కట్టి బియ్యంలో ఉంచితే కూడా మంచి ఫలితం ఉంటుంది. ఇలా చేయడం వల్ల కూడా బియ్యం పురుగు పట్టకుండా ఉంటుంది. ఎక్కువగా పురుగులు పడితే బియ్యాన్ని సూర్య కాంతిలో ఎండబెట్టాలి. అలా అని మరీ ఎర్రటి ఎండలో ఎండబెడితే, గింజలు విరిగిపోయి నూకల్లా తయారవుతాయి. కాబట్టి సూర్యకాంతి తగిలేటట్టు ఒక షీట్ మీద విస్తరించి ఎండబెట్టండి. పురుగులన్నీ పోయాక గాలి చొరబడని కంటైనర్లో వేసి ప్యాక్ చేయండి.అలాగే బియ్యంలో నల్ల మిరియాలు చల్లడం ద్వారా పురుగులు పట్టకుండా చూసుకోవచ్చు. . ప్రతి రెండు నెలలకు ఒకసారి బియ్యం, ఇతర ధాన్యాలు, పప్పులు ఇలా ఎండలో ఉంచడం మంచిది.బియ్యంలో అల్లం ముక్క, పసుపును కలపడం ద్వారా పురుగులను పారద్రోలవచ్చు

# నాగార్జున సాగర్ ప్రధాన డ్యాంపై సీఆర్పీఎఫ్ భద్రత తొలగింపు

**హైదరాబాద్ పెన్ పవర్:**నాగార్జున సాగర్ ప్రధాన డ్యాంపై సీఆర్పీఎఫ్ భద్రత తొలగించారు. నాగార్జున సాగర్ డ్యాం తిరిగి ఎస్పీఎఫ్ ఆధీనంలోకి వచ్చింది. గత తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సమయంలో నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నిర్వహణ విషయంలో ఇరు రాష్ట్రాల మధ్య వివాదం రాజుకున్న విషయం తెలిసిందే. బోర్డుకు ఇండెంట్ ఇస్తున్నా తెలంగాణను పదేపదే అడగాల్సి వస్తోందని..13వ గేటు నుంచి తమ వైపు ఉన్న గేట్లను తామే ఆపరేట్ చేసుకుంటామని కృష్ణా బోర్డుకు లేఖ రాసింది.



తెలంగాణ ప్రభుత్వం స్పందిస్తూ.. ప్రస్తుతం 13వ క్రెస్ట్ నుంచి ఏపీ పరిధిలో మిగతా భాగమంతా తెలంగాణ పరిధిలో ఉన్నది. తమ పరిధిలో ఉన్న ప్రాజెక్టును ఏపీ బలవంతంగా ఆక్రమించిందని తెలంగాణ కేంద్రానికి ఫిర్యాదు చేయడం వంటి పరిణామాలతో ఎన్నికల సమయంలో తీవ్ర ఉద్రిక్తతలు తలెత్తాయి. ఈ క్రమంలో సమయంలో కేంద్ర బలగాలు రంగ ప్రవేశంతో కాస్త ఉద్రికత్త తగ్గింది. ఆ విషయంలో కేంద్ర హోం శాఖ, జలవనరుల శాఖలు రెండు రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపి, కృష్ణా బోర్డుకు చెందిన ఇద్దరు అధికారులు క్షేత్ర స్థాయి పరిశీలన కూడా చేశారు.

ఐతే ఏపీ పునర్వ్యవస్థీకణ చట్టం ప్రకారం సాగర్ నిర్వహణ తెలంగాణే చూస్తుందని, కాబట్టి వెంటనే ప్రాజెక్టును అప్పగించాలని తెలంగాణ కేంద్రానికి వరుస లేఖలు రాసింది. కేంద్ర హోంశాఖ సూచించిన విధంగా 2023 నవంబర్ 28కి ముందు ఉన్న పరిస్థితిని కొనసాగేలా చూడాలని కోరింది. ప్రస్తుతం నాగార్జున సాగర్ డ్యాం భద్రత కేఆర్ ఎంబీ అధీనంలో ఉండటంతో సీఆర్ పీఎఫ్ బలగాలతో భద్రత నిఘాలో ఉంది.. ఇరు రాష్ట్రాల మధ్య అవగాహన రావడంతో సీఆర్పీఎఫ్ నుంచి భద్రతపరమైన చర్యలను ఎస్పీఎఫ్ అప్పజెప్పారు.

# మహిళ కానిస్టేబుల్‌ను కాపాడేందుకే ఇద్దరు దూకేశారు

## ట్రిపుల్ సూసైడ్ కేసులో వీడిన మిస్టరీ



**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలో సంచలనంగా మారిన ఎస్ఐ, మహిళా కానిస్టేబుల్, కంప్యూటర్ ఆపరేటర్ల ట్రిపుల్ సూసైడ్ కేసులో బిగ్ ట్విస్ట్ చోటు చేసుకుంది. ముగ్గురి ఆత్మహత్యలకు కారణమేంటన్న మూడు రోజుల ఉత్కంఠకు తెరపడింది. చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన మహిళా కానిస్టేబుల్ శృతిని కాపాడే ప్రయత్నంలో ఎస్ఐ, కంప్యూటర్ ఆపరేటర్ ఇద్దరు చెరువులోకి దూకినట్లు పోలీసులు గుర్తించారు. పోలీసుల వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా భిక్కనూరు ఎస్ఐ సాతెల్లి సాయికుమార్( 31), బీబీపేట పోలీస్‌స్టేషన్‌లో మహిళా కానిస్టేబుల్‌గా పని చేస్తున్న శృతి (28), బీబీపేట సొసైటీలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్న తోట నిఖిల్(28).. సదాశివనగర్‌మండలం అడ్లూర్‌ఎల్లారెడ్డి చెరువులో శవాలుగా తేలిన విషయం తెలిసిందే.

ఏకంగా ఎస్ఐ, ఓ మహిళా కానిస్టేబుల్‌తో పాటు మరో వ్యక్తి ఒకేసారి చెరువులో ఆత్మహత్య చేసుకోవడం కామారెడ్డి జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. దీంతో పోలీసులు ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలోనే పోలీసులు విచారణలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. మొదటగా ఆత్మహత్య చేసుకోవడానికి కానిస్టేబుల్ శృతి చెరువులో దూకగా.. ఆమెను కాపాడేందుకు కంప్యూటర్ ఆపరేషర్ నిఖిల్ చెరువులో దూకాడు. నిఖిల్ కు ఈత రాకపోవడంతో శృతితో పాటు అతడి నీటిలో మునిగిపోయాడు. నీటిలో గల్లంతయిన శృతి, నిఖిల్ ను కాపాడేందుకు ఎస్ఐ సాయి చెరువులోకి దూకగా.. చెరువు పెద్దది కావడంతో అతడు కూడా నీటిలో గల్లంతయ్యాడు. ఒకరిని కాపాడబోయి మరొకరు ముగ్గురు ఇలా మృతి చెందారని పోలీసులు వెల్లడించారు.

**ముగ్గురి మధ్య పరిచయం ఉందా..?**

మెదక్ జిల్లా కొల్చారానికి చెందిన సాయికుమార్ 2018లో ఎస్సైగా ఎంపికయ్యారు. ఏడాది క్రితం కామారెడ్డి జిల్లాలోని బీబీపేట పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. ప్రస్తుతం భిక్కనూరు ఎస్సైగా ఉన్నారు. ఈయనకు భార్య లక్ష్మీ, మూడేండ్ల కొడుకు ఉన్నారు. లక్ష్మీ ప్రస్తుతం గర్భవతి. ఇక మహిళా కానిస్టేబుల్‌శృతిది గాంధారి మండల కేంద్రం. పదేండ్ల కింద ఉద్యోగంలో చేరిన ఈమె.. పెండ్లయిన తర్వాత కొన్నాళ్లకు భర్తతో విడాకులు తీసుకుంది. మూడేండ్లుగా బీబీపేట స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నది.

సాయికుమార్ బీబీపేటలో పని చేసినప్పుడు శృతి అక్కడే కానిస్టేబుల్‌గా ఉంది. ఈ క్రమంలో వీరి మధ్య పరిచయం ఉన్నట్టు అనుమానిస్తున్నారు. మరోవైపు బీబీపేటకు చెందిన నిఖిల్.. కంప్యూటర్లు కూడా రిపేర్ చేస్తుంటాడు. ఈ క్రమంలో పోలీస్‌స్టేషన్లలో కూడా కంప్యూటర్ రిపేర్లు చేస్తున్నాడు. ఇతని ఇంటికి సమీపంలోనే శృతి కిరాయికి ఉంటున్నది. కాగా, వీళ్ల ముగ్గురి మధ్య పరిచయం ఉన్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు.

**ఆ రోజు ఏం జరిగింది..?**

కానిస్టేబుల్‌శృతి బుధవారం పొద్దున డ్యూటీ కంప్లీట్ అయిన తర్వాత తన సొంతూరు గాంధారికి వస్తున్నట్టు ఫోన్లో తల్లి విజయకు చెప్పింది. కొద్ది సేపటికి ఫోన్‌చేస్తే తాను సగం దూరం వచ్చానని, కానీ డ్యూటీ ఉందని మళ్లీ స్టేషన్ కు రమ్మంటున్నారని తెలిపింది. మధ్యాహ్నం తర్వాత ఫోన్‌చేస్తే లిఫ్ట్ చేయలేదు. ఎస్సై సాయికుమార్ బుధవారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో తన సొంత కారులో క్వార్టర్ నుంచి బయలుదేరారు. ఎక్కడికి వెళ్తున్నాననేది ఎవరికీ చెప్పలేదు. వెళ్లేటప్పుడు తాళం కూడా వేయలేదని తెలిసింది.ఆయన నాలుగు రోజుల క్రితమే భార్య లక్ష్మీని ఇంటి దగ్గర దింపి వచ్చారు. బుధవారం పొద్దున కుటుంబ సభ్యులతో ఫోన్ మాట్లాడినప్పుడు ఇంటికి వస్తానని చెప్పారు. ఇక నిఖిల్ 11 గంటల వరకు బీబీపేటలోనే ఉన్నాడు. ఇంట్లో తిని బయటకు వెళ్లాడని తల్లి స్వరూప తెలిపింది. కాగా, శృతి ఫోన్ కలవకపోవడంతో కుటుంబసభ్యులు బీబీపేట పోలీస్ స్టేషన్ కు వెళ్లారు. ఉన్నతాధికారులకు విషయం తెలిసి సెల్‌ఫోన్ టవర్ లోకేషన్ ఆధారంగా వెరిఫై చేయగా, లోకేషన్ అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువు ఏరియాలో చూపెట్టింది. అక్కడికి సిబ్బంది వెళ్లి చూడగా చెరువు ఒడ్డున సెల్‌ఫోన్‌దొరికింది.సమీపంలోనే ఎస్సై సాయికుమార్‌కారు ఉంది. అందులో శృతి బ్యాగు ఉన్నట్టు సమాచారం.

ఎస్సై సెల్‌ఫోన్‌అతని ప్యాంట్ జేబులోనే ఉండగా.. మిగతా ఇద్దరి ఫోన్లు చెరువు గట్టున దొరికాయి. కాగా, వీళ్లు ముగ్గురు కారులోనే వచ్చినట్టు అనుమానిస్తున్నారు. అసలు వీళ్లు ముగ్గురు ఎక్కడ కలుసుకున్నారు? చెరువు వద్దకు ఎందుకు వచ్చారు? ఏదైనా విషయంలో గొడవ జరిగి ఆత్మహత్య చేసుకున్నారా? అనేది తేలాల్సి ఉంది. ఈ కేసు దర్యాప్తులో మృతుల సెల్ ఫోన్లు, పోస్టుమార్టం రిపోర్టులు కీలకం కానున్నాయి. వీళ్లు ఎలా కలిశారు? అనేది సెల్ ఫోన్ డేటా ద్వారా తెలిసే అవకాశం ఉంది.

# ఇంటి ఖర్చుల్లో దక్షిణాది రాష్ట్రాలు టాప్..తెలంగాణ 3వ స్థానం:

# పెరిగిన ధరలతో మారిన అభిరుచులు ఇలా..




**హైదరాబాద్ పెన్ పవర్:**ఇంటి ఖర్చు.. అంటే నిత్యావసరాలు. పప్పులు, ఉప్పులు, ఆయిల్స్, బియ్యం, కూరగాయలు, మాంసం, ఫ్రూట్స్, ఎగ్స్, మసాలాలు, పానీయాలు.. ఓవరాల్ గా ఇంట్లో ఓ కుటుంబం బతకటం కోసం తినటానికి చేసే ఖర్చులు అన్న మాట.. వీటి ఖర్చు అనేది గణనీయంగా పెరిగినట్లు సర్వే స్పష్టం చేస్తోంది.

దేశవ్యాప్తంగా దక్షిణాది రాష్ట్రాలు టాప్ లో ఉన్నాయి. నెలవారీ ఇంటి ఖర్చులు.. తలసరి వినియోగ వ్యయంలో సౌత్ స్టేట్స్ ముందంజలో ఉన్నాయి. గృహ వినియోగ వ్యయ సర్వే 2023..24 మధ్య ఏయే రాష్ట్రాల్లో ఎంతెంత ఖర్చు అవుతున్నది అనేది ఈ సర్వే స్పష్టం చేసింది.

2023 ఆగస్ట్ నుంచి.. 2024 జూలై మధ్య.. దేశ వ్యాప్తంగా 2 లక్షల 61 వేల 953 మందిని సర్వే చేయగా.. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో లక్షా 54 వేల 357 మందిని.. పట్టణ ప్రాంతాల్లో లక్షా 7 వేల 596 మంది నుంచి ఈ వివరాలు సేకరించింది ఈ సర్వే సంస్థ. నెలవారీ గృహ వినియోగ వ్యయంలో కేరళ రాష్ట్రం మొదటి స్థానంలో ఉంది.

కేరళ రాష్ట్రంలో గ్రామీణ కుటుంబాలు నెలకు 6 వేల 611 రూపాయలు ఖర్చు చేస్తుండగా.. పట్టణ కుటుంబాలు 7 వేల 834 రూపాయలు ఖర్చు చేస్తున్నాయి. తమిళనాడు గ్రామీణ ప్రాంతాల్లో నెలకు 5వేల 872 రూపాయలు ఖర్చు చేస్తుండగా.. పట్టణ ప్రాంతాల్లో 8వేల 325 రూపాయలు ఖర్చు చేస్తున్నారు.

ఇక నెలవారి గృహవినియోగ వ్యయంలో తెలంగాణ మూడో స్థానంలో ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో 5వేల675 రూపాయలు ఖర్చు చేస్తుండగా.. పట్టణ ప్రాంతాల్లో 9వేల131 రూపాయలు ఖర్చు చేస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ లో గ్రామీణ కుటుంబాలు 6వేల107 రూపాయలు, పట్టణ గృహాలు 9వేల877 రూపాయలు ఖర్చు చేస్తున్నాయి. కర్ణాటక గ్రామీణ ప్రాంతాల్లో 5వేల068 రూపాయలు , అర్బన్ జోన్లలో 8వేల 169రూపాయలతో కర్ణాటక ఐదు స్థానంలో నిలిచింది.ఇదంతా నెలవారి గృహవినియోగ వ్యయంలో జాతీయ సగటుతో పోల్చినపుడు ఈ రాష్ట్రాలు వరుసగా మూడు స్థానాల్లో ఉన్నాయి. జాతీయ సగటు నెలవారి గృహ వినియోగ వ్యయం గ్రామీణ ప్రాంతాల్లో 4వేల122 రూపాయలు ఉండగా.. పట్టణ ప్రాంతాల్లో 6వేల 996రూపాయలు ఖర్చు చేస్తున్నారు.

# తెలంగాణలో డిసెంబర్ 31న వైన్ షాపులు ఎప్పటి దాకా తెరిచి ఉంటాయంటే..!



**హైదరాబాద్ పెన్ పవర్:**డిసెంబర్ 31 వేడుకలకు ఏర్పాట్లు చేసుకుంటున్న మందుబాబులకు తెలంగాణ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. కొత్త సంవత్సరం వేడుకల సందర్భంగా ఆ రోజు అర్ధరాత్రి దాకా వైన్ షాపులు తెరుచుకోవచ్చని అనుమతిచ్చింది. బార్లు, రెస్టారెంట్లు రాత్రి ఒంటిగంట దాకా వ్యాపారం చేసుకోవచ్చని చెప్పింది. ఈమేరకు ఎక్సైజ్ శాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతూ నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాలు, పలు ఈవెంట్లకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది.గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిర్వహించే స్పెషల్ ఈవెంట్లకు పలు షరతులతో అనుమతినిచ్చింది. పార్టీలు, పబ్ లలో డ్రగ్స్ వినియోగించకుండా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులను ఆదేశించింది. డిసెంబర్ 31 రాత్రి నిర్వహించే ఈవెంట్లలో డ్రగ్స్ వినియోగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసింది. కాగా, వైన్ షాపులు అర్ధరాత్రి దాకా తెరిచి ఉంచేందుకు అనుమతినివ్వడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరుతుందని అధికారవర్గాలు తెలిపాయి.

## మన్మోహన్ సింగ్ కన్నుమూతపై అమెరికా ప్రెసిడెంట్ బైడెన్ సంతాపం.. ప్రత్యేక ప్రకటన విడుదల



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కన్నుమూతపై ప్రపంచ దేశాధినేతలు సంతాపాలు వ్యక్తం చేస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కూడా తాజాగా ఈ జాబితాలో చేరారు. ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ శనివారం సంతాప సందేశాన్ని విడుదల చేశారు. మన్మోహన్ సింగ్ నిజమైన రాజనీతిజ్ఞుడు అని బైడెన్ కొనియాడారు. ఆయన వ్యూహాత్మక ముందుచూపు, రాజకీయ ధైర్యంతో భారత్-అమెరికా మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని అపూర్వ స్థాయికి చేర్చారంటూ కొనియాడారు. "మన్మోహన్ సింగ్ వ్యూహాత్మక విజన్, రాజకీయ ధైర్యం లేకుంటే భారత్-అమెరికా మధ్య సహకారం ఈ స్థాయిలో ఉండడం సాధ్యం కాదు. ఆయనను కోల్పోయిన ఈ కష్టకాలంలో భారత ప్రజలతో పాటు నేను, నా భార్య జిల్ బైడెన్ కూడా దుఃఖిస్తున్నాం. మన్మోహన్ సింగ్ దార్శనికతను గుర్తుచేసుకుంటున్నాం. మన్మోహన్ భార్య గురుశరణ్ కౌర్, వారి ముగ్గురు పిల్లలు, భారతదేశ ప్రజలందరికీ ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం" అని బైడెన్ ప్రకటించారు.
అమెరికా-భారత పౌర అణు ఒప్పందం నుంచి ఇండో-పసిఫిక్ భాగస్వామ్య దేశాల మధ్య క్వాడ్ కూటమిని ఏర్పాటు చేయడం వరకు, రాబోయే తరాల కోసం ఇరు దేశాలను, ప్రపంచాన్ని పటిష్ఠం చేయడంలో పురోగతికి ఆయన బాటలు వేశారని గుర్తుచేశారు. అంకితభావం ఉన్న ప్రజాసేవకుడని, అన్నింటికంటే దయాగుణం, వినమ్రత కలిగిన వ్యక్తి అని జో బైడెన్ కొనియాడారు. ఈ మేరకు వైట్‌హౌస్ ఒక ప్రకటన విడుదల చేసింది.

# అక్రమ వలసదారులను ఇలా కాల్చి చంపేయండి

**హైదరాబాద్ పెన్ పవర్:**అమెరికాకు అక్రమంగా వలస వచ్చి.. అక్రమంగా నివాసం ఉంటూ.. అమెకన్లను చంపుతున్న వలసదారులను తిరిగి పంపించటం కాదు.. ఇలా కాల్చి చంపేయాలి అంటూ రిపబ్లికన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గోమెజ్ పోస్ట్ చేసిన వీడియో సంచలనంగా మారింది. ఓ కుర్చీలో నల్లటి బ్యాగ్ పెట్టి.. ఆ బ్యాగ్ ను మనిషిగా చూపిస్తూ.. డమ్మీ తుపాకీతో తలపై కాలుస్తూ ఉన్న వీడియోకు.. అక్రమ వలసదారులకు ఇదే సరైన శిక్ష అనే క్యాప్షన్ ఇచ్చారు. ఈ వీడియో ఇంటర్నెట్ లో వైరల్ అయ్యింది. ఈ వీడియోపై ఇప్పుడు అమెరికాలోనే నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. రెండు దేశాల మధ్య మాటల యుద్ధానికి దారి తీశాయి.రిపబ్లికన్ కాంగ్రెస్ అభ్యర్థి వాలెంటినా గోమెజ్ ఆన్ లైన్ పోస్ట్ వివాదాలకు దారి తీసింది. అక్రమంగా అమెరికాలో ఉంటూ హింసాత్మక నేరాలకు పాల్పడుతున్న వలదారునలు బహిరంగంగా ఉరితీయాలని.. అమెరికా ప్రజలను రెచ్చగొట్టేలే సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ఈ వీడియో నెట్టింటవైరల్ మారింది.. నెటిజన్లనుంచి తీవ్ర విమర్శలకు గురిచేసింది. ఈ రెచ్చగొట్టే వీడియోను వాలెంటినా గోమేజ్.. మంగళవారం %శ%లో షేర్ చేసింది.. కొలంబియాకు చెందిన గోమెజ్.. అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ బలమైన మద్దతుదారు. ఈ వీడియోలో






ఆమె తలపై నల్ల బ్యాగ్‌తో కుర్చీకి కట్టబడిన డమ్మీ తల వెనుక భాగంలో చేతి తుపాకీని కాల్చడం కనిపిస్తుంది. ఈ వీడియోకు జతగా వలసదారుల్ని ఉరితీయాలి అంటూ క్యాప్షన్ తగిలించింది.
అమెరికన్లపై అత్యాచారం, హత్యలు వంటి చట్ట విరుద్ధమైన పనులు చేసే వలసదారులకు బహిరంగంగా ఉరితీయాలి.. వారికి బహిష్కరణ కాదు.. వారిని అంతం చేయాలి అని గోమేజ్ వీడియో చెప్పడం చర్చనీయాంశమైంది.. రెండు దేశాల మధ్య దౌత్యపరమైన వివాదాలకు ఊతమిస్తోంది. గోమేజ్ వీడియోను %శ% లో పోస్ట్ చేసిన కొద్ది సమయంలో నే 5 లక్షల మంది చూశారు.. అయితే ఈ వీడియో %శ% ఫ్లాట్ ఫాం నిబంధనలు ఉల్లంఘించిందని గుర్తించింది.. దీంతో వీడియోను తొలగించింది. దీంతోపాటు గోమేజ్ కు జరిమానా కూడా విధించింది. న్యూయార్ నగరంలో ఇటీవల జరిగిన ఓ మహిళ హత్య తర్వాత గోమేజ్ ఈ వీడియో, వ్యాఖ్యలు చేసింది. గ్వాటెమాలన్ జాతీయుడు వీకెండ్స్ లో ఓ మహిళను కాల్చి చంపాడని అక్కడి పోలీసులు అరెస్ట్ చేశారు.
ఈ వీడియో ఆన్‌లైన్‌లో దుమారం రేపింది.. చాలా మంది సోషల్ మీడియా వినియోగదారులు గోమేజ్ ప్రతిపాదనను తీవ్రంగా ఖండించారు.గోమేజ్ వీడియో రెచ్చగొట్టేలా ఉంది.. చాలా ప్రమాదకరమైనది అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# మన్మోహన్ సింగ్ వ్యక్తిగత జీవిత విశేషాలు పంచుకున్న కూతురు దామన్ సింగ్

- కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో చదివే రోజుల్లో ఆర్థిక సమస్యలు ఎదుర్కొన్నారని వెల్లడి
- పస్తులు ఉండడం, క్యాడ్‌బరీ చాక్లెట్ తిని కడుపు నింపుకున్న సందర్భాలు ఉన్నాయన్న దామన్ సింగ్
- ఆయన బయట ఆహారం ఎప్పుడూ తినలేదని వెల్లడి
- 'స్ట్రిక్ట్లీ పర్సనల్: మన్మోహన్ అండ్ గుర్‌శరణ్' పుస్తకంలో విశేషాలను పంచుకున్న దామన్ సింగ్



**హైదరాబాద్ పెన్ పవర్:**మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కన్నుమూతపై యావత్ దేశం సంతాపం తెలియజేస్తోంది. రెండు పర్యాయాలు దేశ ప్రధానిగా, అంతకుముందు ఆర్థిక శాఖ మంత్రిగా, పలు ఉన్నత పదవులు చేపట్టిన ఆయన గురించి చాలా మంది రాజకీయ నాయకులు, పలు రంగాల ప్రముఖులు చాలా విశేషాలు పంచుకున్నారు. అయితే, మన్మోహన్ సింగ్ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన కొన్ని విశేషాలను ఆయన కూతురు దామన్ సింగ్ వెల్లడించారు. 1950వ దశకం మధ్యలో మన్మోహన్ సింగ్ కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో స్కాలర్‌షిప్‌పై చదువుతున్న రోజుల్లో ఆర్థిక సమస్యలు ఎదుర్కొన్నారని దామన్ సింగ్ తెలిపారు. "నాడు మన్మోహన్ సింగ్‌కు డబ్బు ఒక్కటే అసలైన సమస్య. పస్తులు ఉండడం లేదా క్యాడ్‌బరీ చాక్లెట్ తిని కడుపు నింపుకున్న సందర్భాలు చాలానే ఉన్నాయి" అని ఆమె చెప్పారు.
"కేంబ్రిడ్జ్‌లో చదువుతున్నప్పుడు ట్యూషన్ ఫీజు, జీవన వ్యయాలు కలుపుకొని ఏడాదికి సుమారు 600 పౌండ్‌లు ఖర్చు అయ్యేవి. కానీ, పంజాబ్ విశ్వవిద్యాలయం స్కాలర్‌షిప్ రూపంలో ఏడాదికి 160 పౌండ్‌లు అందజేసేది. అందుకే డబ్బులు లేక చాలా బాధలు ఎదుర్కొన్నారు. అవసరమైన మిగతా డబ్బు కోసం తండ్రిపై ఆధారపడేవారు. మన్మోహన్ సింగ్ చాలా జాగ్రత్తగా ఖర్చుపెట్టేవారు. డైనింగ్ హాల్‌లో సబ్సిడీతో కూడిన భోజనం తినేవారు. ఆయన ఎప్పుడూ బయట ఆహారం తినలేదు" అని దామన్ సింగ్ వివరించారు.

**చిన్నప్పుడు కూడా కష్టాలే**

ఇక, చిన్నప్పుడు పాకిస్థాన్‌లో గడిపిన రోజుల్లో కూడా మన్మోహన్ సింగ్ ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నారని దామన్ సింగ్ వెల్లడించారు. జీవితం చాలా కష్టంగా ఉండేదంటూ తరచుగా మాట్లాడేవారని ప్రస్తావించారు. ప్రస్తుతం పాక్‌లో ఉన్న పంజాబ్ ప్రావిన్స్ పశ్చిమ ప్రాంతంలోని గాహ్‌లో జన్మించారని వివరించారు. " తిరిగి పాకిస్థాన్ వెళ్లాలనుకుంటున్నారా అని నాన్నను నా సోదరి అడిగింది. అస్సలు ఇష్టం లేదని బదులిచ్చారు. నా తాతయ్యను చంపేసిన ప్రాంతానికి వెళ్లను అన్నారు"" అని దామన్ గుర్తు చేసుకున్నారు.
కుటుంబ సమావేశాలు, పిక్నిక్‌లలో మన్మోహన్ సింగ్ జానపద గేయాలు పాడేవారని దామన్ పేర్కొన్నారు. 'స్ట్రిక్ట్లీ పర్సనల్: మన్మోహన్ అండ్ గుర్‌శరణ్' అనే పుస్తకంలో దామన్ సింగ్ ఈ విషయాలను పంచుకున్నారు. తన తల్లిదండ్రుల జీవత విశేషాలను ఆమె ఇందులో పంచుకున్నారు. 2014లో హార్పర్‌కాలిన్స్ ఈ పుస్తకాన్ని ప్రచురించింది.

### శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం సందర్భంగా

# పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు



**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం సందర్భంగా పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం ఏఆర్ అడిషనల్ డీసీపీ రామచంద్రరావు, హుస్నాబాద్ ఏసీపి సతీష్, సిద్దిపేట ఏసీపీ మధు, గజ్వేల్ ఎసిపి పురుషోత్తం రెడ్డి, టాస్క్ ఫోర్స్ ఏసిపి రవీందర్, చేర్యాల సిఐ శ్రీను, కొమురవెల్లి ఎస్ఐ రాజు, కలిసి దేవుడు కళ్యాణం జరుగు తోటబావి మరియు పరిసర ప్రాంతాలు వీఐపీ పార్కింగ్, జనరల్ పార్కింగ్ దర్శన ప్రదేశాలను, పరిశీలించి, బందోబస్తు నిర్వహించే అధికారులకు సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏఆర్ అడిషనల్ డీసీపీ రామచంద్రరావు, హుస్నాబాద్ ఎసిపి సతీష్, శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామి కళ్యాణం మహోత్సవం బందోబస్తుకు వచ్చిన పోలీస్ అధికారులకు సిబ్బందికి పటిష్టమైన బందోబస్తు, కళ్యాణోత్సవం, పార్కింగ్, టెంపుల్ ఆవరణ, గర్భగుడి దర్శనం, తదితర అంశాల గురించి దిశా నిర్దేశం చేశారు. నేడు ఉదయం 6 గంటలకు అధికారులు సిబ్బంది కేటాయించిన ప్రదేశంలో విధి నిర్వహణలో ఉండాలని సూచించారు. ఇన్చార్జి అధికారులు అందరూ తప్పకుండా విహెచ్ఎఫ్ సెర్ట్ యాండిల్ చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సరియైన సమయానికి వచ్చి విధులు నిర్వహించాలని దర్శనానికి వచ్చే ప్రజలతో మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. మన వల్ల ఎవరికి ఇబ్బంది కలగకుండా క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని సూచించారు. బందోబస్తు విషయంలో కానీ ఏ విషయంలోనైనా ఎలాంటి సమస్యలు ఉన్నా సంబంధిత అధికారులకు తెలియపరచాలని సూచించారు. దేవుని కళ్యాణంలో విధులు నిర్వహించడం అదృష్టంగా భావించాలని సూచించారు. మూడు నెలల పాటు ప్రతి ఆదివారం బ్రహ్మోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం సందర్భంగా పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.బందోబస్తును 4 సెక్టార్లుగా విభజించడం జరిగింది.కళ్యాణ మహోత్సవం వేదిక తోటబావి వద్ద,టెంపుల్ ఆవరణ గర్భగుడి దర్శనం,ట్రాఫిక్

పార్కింగ్ ప్రదేశాలు,

వేలాదిగా తరలి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాట చేయడం జరిగింది. పోలీస్ కంట్రోల్ రమ్ ను ఏర్పాటు చేస్తున్నాం, ప్రతి డిపార్ట్మెంట్ సంబంధించిన వారు కంట్రోల్ రూంలో అందుబాటులో వుండి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు మరియు విఐపి దర్శనం, శీఘ్ర దర్శనం, సాధారణ దర్శనం, మూడు విభా మూడు విభాగాలుగా విభజించడం జరిగింది. కళ్యాణ వేదిక వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగింది, పార్కింగ్ ప్రదేశాలలో మరియు టెంపుల్ ఆవరణలో 75 సీసీ కెమెరాలతో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుంది. అడిషనల్ డీసీపీలు2, ఎసిపిలు6, సిఐలు 25, ఎస్ఐలు26, ఏ ఎస్ఐలు హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, మహిళా కానిస్టేబుళ్ళు, మహిళ హోంగార్డులు, బీడీ టీమ్స్, యాక్సెన్ కంట్రోల్, రోప్ పార్టీ మొత్తం 361 అధికారులు సిబ్బంది మందితో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుంది.

పార్కింగ్ ప్రదేశాలు:

తోటబావి సమీపంలో ఎడమవైపు చుట్టు కాంపౌండ్ వాళ్ళు ఉన్న ప్రదేశంలో విఐపి పార్కింగ్ ఏర్పాటు చేయడం జరిగింది.

సిద్దిపేట, చేర్యాల, కిష్టంపేట మరియు కొమురవెల్లి కమాన్ నుండి వచ్చే వాహనదారులు బస్టాండ్ పక్కన ఉన్న ఖాళీ ప్రదేశంలో వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేయడం జరిగింది.

హైదరాబాద్, కొండపోచమ్మ టెంపుల్ నుండి, ఐనాపూర్ గ్రామం వచ్చే వాహనదారులకు కొమురవెల్లి పెట్రోల్ పంపు వెనుక ఉన్న ఖాళీ ప్రదేశంలో, శ్రీ హోటల్ వెనుక ఉన్న ఖాళీ ప్రదేశంలో పార్కింగ్ ఏర్పాటు చేయడం జరిగింది.

శ్రీ కొమరవెల్లి మల్లికార్జున స్వామి కళ్యాణానికి వచ్చే భక్తులు పోలీసు వారి సలహాలు సూచనలు పాటించి వాహనాలు పార్కింగ్ ప్రదేశంలో పార్కు చేసి ప్రశాంతంగా దేవుని దర్శనం చేసుకుని వెళ్లాలని సూచించారు.

రోడ్డుకు అడ్డదిడ్డంగా వాహనాలు పెడితే వచ్చిపోయే భక్తులకు ప్రజలకు ఇబ్బందిగా ఉంటుందని అట్టి వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సిద్దిపేట ఏసీపీ మధు, టాస్క్ ఫోర్స్ ఏసిపి రవీందర్, గజ్వేల్ ఏసిపి పురుషోత్తం రెడ్డి, చేర్యాల సిఐ శ్రీను, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీధర్, హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్, మరియు సిఐలు, ఇన్స్పెక్టర్లు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి కేటీఆర్ కు ఈడీ నోటీసులు?

### జనవరి 7న విచారణకు రండి

**హైదరాబాద్ పెన్ పవర్:** ఫార్ములా ఈ–కార్ రేస్ కేసు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తుంది శనివారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు ఈడీ నోటీసులు ఇచ్చింది. 2025 జనవరి 7 న ఈడీ విచారణ కు హాజరు కావాలని నోటీసులో పేర్కొంది.

ఫార్ములా ఈ కార్ రేసింగ్ కేసులో కేటీఆర్ సహ సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, హెచ్ఎం డీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి,లకు కూడా ఈడీ నోటీసులు ఇచ్చింది. జనవరి 2, 3 తేదీల్లో విచారణ కు రావాలని నోటీసులో పేర్కొంది.

ఏసీబీ ఎఫ్ఐఆర్ ఆధారం గా పీఎంఎల్ఏ కింద ఈడీ విచారణ చేస్తోంది. ఫెమా నిబంధనలు ఉల్లంఘన జరిగినట్లు ఇప్పటికే గుర్తించిన ఈడీ. ఎఫ్ ఈ ఓ, కు 55 కోట్లు నగదు బదిలీ , ఆర్థిక పరమైన అవకత వకలు జరిగినట్లు ఈడీ అనుమానం వ్యక్తం చేసింది.

ఫార్ములా ఈ–కార్ రేస్ కేసులో కేటీఆర్. తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. తనపై ఏసీబీ నమోదు చేసిన కేసులను కొట్టివేయాలని కోరుతూ కేటీఆర్ ఈ నెల 21న హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు.

అయితే ఆ పిటిషన్పై ఇప్పటి కే విచారణ చేపట్టిన ధర్మాసనం.. ఈ నెల 30వ తేదీ వరకు కేటీఆర్ను అరెస్ట్ చేయవద్దని ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో విచారణ కొనసాగించ వచ్చని పేర్కొంటూ కౌంటర్ దాఖలు చేయాలని ఏసీబీ, పురపాలక శాఖ కార్యదర్శి దానకిషోర్కు హైకోర్టు నోటీసులు జారీ చేసింది.

ఈ నేపథ్యంలో శుక్రవారం.. కేటీఆర్ క్వాష్ పిటిషన్పై మరోసారి విచారణ చేపట్టిన హైకోర్టు. కేసు విచార ణను మంగళ వారానికి వాయిదా వేసింది. ఈ కేసులో కేటీఆర్ను అరెస్టు చేయవద్దని ఏసీబీ పిటిషన్ దాఖలు చేయగా, కోర్టు కౌంటర్ దాఖలు చేయాలని కేటీఆర్తో పాటు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

అయితే కౌంటర్ దాఖలు చేసేందుకు ప్రభుత్వం సమయం కోరగా. విచారణ ను మంగళ వారానికి వాయిదా వేస్తున్నట్లు న్యాయమూర్తి ప్రకటిం చారు. అదేవిధంగా ఈ నెల 31 వరకు కేటీఆర్ ను అరెస్ట్ చేయవద్దని, పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు.

## హైడ్రా కూల్చివేతలు ఆగవు



**హైదరాబాద్ పెన్ పవర్:** హైడ్రా కూల్చివేతలు ఆగవని ఆ సంస్థ కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేసారు. ఎఫ్టీఎల్ గుర్తింపు తరువాత హైడ్రా కూల్చివేతలు స్టార్ట్ అవుతాయి. హైడ్రా కు 15 టీమ్స్ అందుబాటులో ఉన్నాయి. హైడ్రా నోటీసులు ఇవ్వదు – వాటర్ బాడీలో అక్రమ కట్టడాలకు నోటీసులు ఇవ్వాల్సిన అవసరం లేదని అన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు వరకు హైడ్రా ఉంది. హైడ్రా డిజాస్టర్ లో ఉంది అసెస్ట్ ప్రొటెక్షన్ లో ఉంది. హైడ్రా బఫర్ జోన్ కి సంబంధించి ప్రజలో అవగాహన కల్పించాం. త్వరలో హైడ్రా పోలీస్ స్టేషన్ రానుంది. 1025 వాటర్స్ బాడీస్ కనుగున్నం. సాంకేతిక పరిజ్ఞానం తో డేటా సేకరిస్తున్నం. ఏరియల్ డ్రోన్ ఇమేజెస్ సేకరిస్తున్నం. 2006 నుంచి 2023 డేటా కంపేర్ చేస్తున్నాం. 300 ఎకరాల ప్రభుత్వ భూమి ని స్వాధీనం చేసుకున్నాం. హైడ్రా అనేది త్వరలో మీరు చూస్తారు. 30 డీఆర్ఎఫ్ టీమ్స్ ఉన్నాయ్. త్వరలో 72 టీమ్స్ వస్తున్నాయ్. నాగోల్ లో డీఆర్ఎఫ్ ట్రెయింగ్ సెంటర్ డెవలప్ చేస్తున్నాం. హైడ్రా మెటోలాజికల్ డిపార్ట్మెంట్ డీజీ తో మాట్లాడం. ఆటోమేటిక్ వెదర్ స్టేషన్ కూడా పెంచుతున్నాం. వెదర్ డేటా అనలైజ్ చేయడానికి హైడ్రా ను డి వక టీం ఏర్పాటు చేస్తున్నామని అన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో బాలింత మృతి

**హైదరాబాద్ పెన్ పవర్:** జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రిలో దారుణం జరిగింది. బాలింత సుమతి (25) మృతి చెందింది. మృతురాలు నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం మిర్జాపురం గ్రామానికి చెందిన సుమతిని శుక్రవారం రెండో కాన్పు కోసం తీసుకువచ్చారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఫిట్స్ కారణంగా బాలింత మృతి చెందినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రఫీక్ పాషా వెల్లడించారు..

## కంటోన్మెంట్ ఆసుపత్రిని సందర్శించిన ఎంపి ఈటల

**హైదరాబాద్ పెన్ పవర్:** బొల్లారంలోని కంటోన్మెంట్ ఆసుపత్రిని మల్కాజ్ గిరి పార్లమెంటు సభ్యుడు ఈటెల రాజేందర్ సందర్శించారు. ఆసుపత్రిలో పలు విభాగాలలో తిరుగుతూ వైద్యులతో, వార్డులలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడుతూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. కంటోన్మెంట్ ఆసుపత్రిలో వైద్యుల, సిబ్బంది మందుల కొరత ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందని ఈ అంశాన్ని కంటోన్మెంట్ బోర్డులో ప్రస్తావించి వైద్యుల సంఖ్యను పెంచడంతోపాటు మెరుగైన వైద్య సదుపాయాలు అందించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఇటీవల కాలంలో వైద్యులు ఉన్నప్పటికీ సరైన వైద్యం అందించడం లేదని ఆరోపణలు ఉన్నాయని అన్నారు. రానున్న రోజుల్లో వైద్యులు వైద్య సదుపాయాలు పరికరాల సంఖ్యను పెంచడంతోపాటు మెరుగైన వైద్య సదుపాయాలు చికిత్సలు అందించేందుకు కృషి చేస్తానని అన్నారు. కంటోన్మెంట్ తో పాటు సమీప ప్రాంత ప్రజలకు మీ ఆసుపత్రిలో వైద్య సేవలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

## పేదల పెన్నిధి పీజేఆర్

**హైదరాబాద్ పెన్ పవర్:** పేదల పెన్నిధి కార్మిక పక్షపాతి పి.జనార్ధన్ రెడ్డి అని కాంగ్రెస్ నేతలన్నారు. పాపిరెడ్డి నగర్ అధ్యక్షుడు చంద్రారెడ్డి.పిజెఆర్ వర్ధంతి సందర్భంగా కూకట్ పల్లి డివిజన్ ఆస్ బెస్టస్ కాలనీలో చంద్రరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పీజేఆర్ విగ్రహానికి సీనియర్ నాయకులు విటల్ ముదిరాజ్, అంబాల మహేష్ గౌడ్ లు పాల్గొని పీజేఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక, పేద ప్రజల పక్షాన పోరాడి వారి అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేసిన మహానీయుడు పీ జనార్దన్ రెడ్డి అని కొనియాడారు.

## వివాహితపై అత్యాచారం

**హైదరాబాద్ పెన్ పవర్:** నిర్మల్ పట్టణం మంజులాపూర్ కి చెందిన వివాహితపై నిన్న అర్ధరాత్రి అత్యాచారం జరిగింది. బస్టాండ్ లో ఆటో కోసం వేచి ఉన్న వివాహితపై వివాహితపై గుర్తు తెలియని వ్యక్తులు అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలికి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసారు. దర్యాప్తు కు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల, బాధితురాలిని పరామర్శించారుఉ.

## తక్షణమే మెస్ చార్జీలు విడుదల చేయాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** సిద్దిపేట నాసరపుర కేంద్రంలోని బ్రిడ్జ స్కూల్ లో దుప్పట్ల పంపిణీ కార్యక్రమంలో మాజీ మంత్రి హరీష్ రావు పాల్గోన్నారు.హరీష్ రావు మాట్లాడుతూ చలికాలంలో విద్యార్థులు వేడినీళ్లు రాక, దుప్పటి రాక ఇబ్బంది పడుతున్నారు. గత నాలుగు నెలల నుండి మెస్ బిల్లులు పెండింగ్ లో ఉన్నాయి. అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్ ఛానల్ పెట్టి రాష్ట్రంలో ఒక్క రూపాయి బిల్లు పెండింగ్ లేదు అని అన్నారు కానీ ఇక్కడ అలాంటి పరిస్థితి లేదు. ముఖ్యమంత్రి మాటలు కోటలు దాటుతున్నాయి చేతలు గడప దాటడం లేదు.. మాటల ముఖ్యమంత్రి తప్ప చేతల ముఖ్యమంత్రి కాదు రేవంత్ రెడ్డి. పరిపాలన మీద మీరు పట్టు కోల్పోయారా ప్రభుత్వం ఫెయిల్ అనిపిస్తుంది. ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు అమలు చేయడం లేదు. ముఖ్యమంత్రి మాటలు అధికారులు వినడం లేదా లేక ముఖ్యమంత్రి ఊరికే చెప్పానని అధికారులకు చెబుతున్నారా. ముఖ్యమంత్రి అంటే అధికారులకు భయం లేదా విలువ లేదా. తక్షణమే అన్నిచోట్ల మెస్ చార్జీలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నానని అన్నారు. అన్ని శాఖలు మీ దగ్గర పెట్టుకొని ఎందుకు రివ్యూ చేయడం లేదు. ఢిల్లీ పైసలు ఇచ్చినా గల్లి విడుదల చేయడం లేదని అన్నారు.

## దేవాలయ భూములలో సోలార్ ప్లాంట్ల ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణా ప్రభుత్వం దేవాలయ భూములపై సోలార్ ప్లాంట్ల నిర్మాణానికి చేసిన ప్రతిపాదనపై విశ్వ హిందూ పరిషత్ (విహెచ్పి) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. సోలార్ ప్లాంట్ల ముసుగులో దేవాలయ భూములను ఆక్రమించాలనే కుట్రలను విహెచ్పి ఖండించింది. ఈ మేరకు దేవాలయ భూములపై జరిగే దుర్వినియోగానికి తెరలేపిన ప్రభుత్వాన్ని వెంటనే తమ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఎడుఖ డిమాండ్ చేసింది.

దేవాలయ భూములపై ప్రభుత్వ అక్రమాలపై ఆగ్రహం విహెచ్పి ప్రతినిధులు ప్రభుత్వ తీరును తీవ్రంగా వ్యతిరేకిస్తూ, దేవాలయ భూములకు ప్రభుత్వం యజమాని కాదని, కేవలం సంరక్షకురాలిగా ఉండాలని స్పష్టం చేశారు. అయితే, ఇప్పటివరకు ప్రభుత్వం పలు మార్లు దేవాలయ భూములను ప్రైవేటు వ్యక్తులకు విక్రయించడం, మున్సిపల్ అవసరాల కోసం స్వాధీనం చేసుకోవడం వంటి చర్యలకు పాల్పడిందని ఆరోపించారు.

# 10 లక్షల విజిటర్స్ వీసాలు..

**హైదరాబాద్ పెన్ పవర్:** రికార్డు స్థాయిలో విజిటర్స్ వీసాలు సహా మొత్తం పది లక్షలకుపైగా వలసేతర వీసాలను భారతీయులకు జారీచేసినట్లు న్యూఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయం ప్రకటించింది. వరుసగా రెండో ఏడాది భారతీయులే టాప్‌లో నిలిచినట్లు పేర్కొంది. అలాగే, ఉన్నత విద్య కోసం తమ పౌరులను అమెరికాకు పంపిన దేశాల వరసలోనూ భారత్ మొదటి స్థానంలో నిలిచిందని తెలిపింది. ఈ ఏడాది 3,31,000 మంది విద్యార్థులను భారత్ పంపినట్లు పేర్కొంది. 2008/2009 తర్వాత ఈ స్థాయిలో విదేశీ విద్యార్థులు అమెరికాకు రావడం ఇదే మొదటిసారి. అంతేకాదు, వరుసగా రెండో ఏడాది అత్యధికంగా గ్రాడ్యుయేట్లను అమెరికాకు పంపిన ఘనతను కూడా భారత్ సొంతం చేసుకుంది. ప్రస్తుతం అమెరికాలో రెండు లక్షల మంది (19 శాతం) భారతీయ గ్రాడ్యుయేట్లు ఉన్నారు. విద్య తర్వాతి స్థానంలో పర్యాటకం, వ్యాపార అవసరాల కోసం భారతీయులు తమ దేశాన్ని సందర్శిస్తున్నారని అమెరికా కాన్సులేట్ తెలిపింది. గత నాలుగేళ్లలో అమెరికాకు వెళ్లే భారతీయ




పర్యటకుల సంఖ్య ఐదు రెట్లు పెరిగి.. 20 లక్షలకు చేరిందని వెల్లడించింది. 2023లో 11 నెలలతో పోల్చితే.. ఈ ఏడాది అదే కాలానికి పెరుగుదల 26 శాతమని తెలిపింది. ఇప్పటికే అమెరికాలో భారత్‌కు చెందిన నాన్-ఇమ్మిగ్రెంట్ వీసాదారుల 50 లక్షల మంది ఉన్నారని, రోజూ ఈ వీసాలను వేలల్లో జారీ చేస్తున్నామని పేర్కొంది. ఇదే సమయంలో హెచ్-1బీ వీసా పునరుద్ధరణ పైలెట్ విధానం మంచి ఫలితాలను ఇచ్చిందని అమెరికా విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. వీసాదారులు తమ దేశానికి వెళ్లకుండా అమెరికాలోనే రెన్యువల్ చేసుకునేలా ఈ విధానం తీసుకొచ్చారు. ఈ విధానంతో అత్యధికంగా అమెరికాకు ప్రత్యేక వృత్తి నిపుణులను అందిస్తున్న భారత్ ఎక్కువ లబ్ధి పొందనుంది. సాధారణంగా హెచ్-1బీ వీసాపై అమెరికా వెళ్లేవారు.. దాని గడువు ముగియగానే స్వదేశానికి వచ్చి స్టాంపింగ్ చేయించుకోవాల్సి ఉంటుంది. ప్రయోగాత్మకంగా చేపట్టిన కొత్త విధానం ప్రకారం.. ఇకపై అమెరికాలోనే వీసాలను రెన్యువల్ చేయించుకునే వెసులుబాటు కలగనుంది. “భారతీయులకు 10 వలస వీసాలను జారీ చేశాం.. ఇది చట్టబద్ధమైన, నైపుణ్యం కలిగిన నిపుణుల వలసను సులభతరం చేసింది... ఈ వీసాదారులు అమెరికాలో శాశ్వత నివాసితులు అయ్యారు.. ఇప్పటికే మా దేశంలో గణనీయంగా ఉన్న ప్రవాస భారతీయులకు వీరు అదనం' అని ఆ ప్రకటన పేర్కొంది. గణాంకాల ప్రకారం.. 24,000 పాస్‌పోర్ట్‌లు, ఇతర కాన్సులర్ సేవలను అందించింది. స్మార్ట్ ట్రావెలర్ ఎన్‌రోల్‌మెంట్ ప్రోగ్రామ్ (ఞఇఖ)లో మార్పుల వలన ఎంబసీ, కాన్సులేట్‌లను అమెరికా పౌరులను అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించడం, వారికి భద్రతకు హెచ్చరికలను పంపడం సులభతరం చేస్తోంది.

# ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రజల సహకారం లేనిదే ఏ కార్యక్రమాన్ని విజయవంతం చేయలేమని, ప్లాస్టిక్ రహిత సమాజాన్ని తీసుకురావాలంటే, వారి సహకారం అవసరమని రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి అన్నారు. శనివారం బనగానపల్లెలోని మంత్రి క్యాంపు కార్యాలయం నుంచి మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి – ఇందిరమ్మ దంపతుల ఆధ్వర్యంలో ప్లాస్టిక్ కు వ్యతిరేకంగా మెగా ర్యాలీని నిర్వహించారు. ప్లాస్టిక్ రహిత బనగానపల్లె లక్ష్యంగా.. 'నా బనగానపల్లె – నా ఆరోగ్యం' పేరుతో నిర్వహించిన మెగా ర్యాలీలో నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా తదితరులు పాల్గొన్నారు. ఈ మెగా ర్యాలీకి వేలాదిగా తరలి వచ్చిన ప్రజలు, విద్యార్థులు, యువకులు, కార్యకర్తలు, పట్టణ ప్రముఖులు ప్లాస్టిక్ వ్యతిరేకంగా నినాదాలతో ర్యాలీని హోరెత్తించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వ్యతిరేకంగా ఏ కే అనిల్ టీమ్ వాళ్లు చేసిన ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. అలాగే ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు చేసిన నృత్యం అందరినీ అలరించింది.. వారిని ప్రోత్సహిస్తూ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి రూ. 10 వేలు వారికి బహుమతిగా అందజేసారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ నా సతీమణి ఇందిరమ్మ ప్లాస్టిక్ రహిత కార్యక్రమం ప్రారంభించిన తొలినాళ్లలో ఎంత వరకు దీన్ని తీసుకెళ్లగమనే ఆలోచనలు ఉన్నప్పటికీ, ఆమె ఎంతో పట్టుదలతో ఈ కార్యక్రమాన్ని చేపట్టి ప్రజల్లో అవగాహన తీసుకురావడం ప్రతి మహిళకు ఇది ఎంతో స్ఫూర్తి ప్రదాయకమ న్నారు. ఏదైనా కార్యక్రమం ప్రారంభించడం విజయవంతం చేయడం అంతా సులభం కాదని... మనకు ఎన్నైనా కోరికలు ఉండొచ్చు, కానీ ప్రజల సహకారం లేనిదే ఏ కార్యక్రమాన్ని కూడా ఏ ఒక్కరు, లేదంటే ఏ ప్రభుత్వం విజయవంతం చేయలేదన్నారు. ప్రజల సహకారం ఉన్నప్పుడే నా బనగానపల్లె – నా ఆరోగ్యం విజయవంతమవుతోం దన్నారు.. నేడు బనగానపల్లె ప్రజల్లో వచ్చిన మార్పు నాకు ప్రత్యక్షంగా కనిపిస్తోందన్నారు. గతంలో మండీ



మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ కు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమం పెట్టినప్పుడు వాళ్లు ఎంతో గొప్పగా సహకరిస్తామని మాట ఇవ్వడంతో దీనికి తొలి అడుగు పడిందన్నారు.. గత రెండున్నర నెలలుగా బీసీ ఇందిరమ్మ, శ్రీనయ్య అందరూ కలిసి ఈ ఉద్యమాన్ని ఎంతో గొప్పగా ముందుకు తీసుకెళ్లారని మంత్రి తెలిపారు. అలాగే స్కూళ్లు, కాలేజీలకు వెళ్లి సహకరించమని కోరినప్పుడు, వారంతా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహకరించడం అభినందనదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు కూడా ఎంతో ఉత్సాహంగా పాల్గొనడంతో పాటు, వారి తల్లిదండ్రుల్లో కూడా అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఏ కార్యక్రమైన విజయం సాధించాలంటే, మహిళల సహకారం అవసరమని మంత్రి అన్నారు. నేడు మహిళలంతా కలిసికట్టుగా ఈ ఉద్యమాన్ని మీ ఇంటి నుంచే మొదలు పెట్టాలని సూచించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బనగానపల్లెలో పర్యటించినప్పుడు, ఎక్కడికెళ్లినా, మురికికాల్వలు ప్లాస్టిక్ తో నిండిపోయి, రోడ్లపైకి చెత్త వచ్చే పరిస్థితి ఉందన్నారు.. ఇది ఎన్నిసార్లు తొలగించినా మళ్లీ, మళ్లీ వచ్చే పరిస్థితి నెలకొందన్నారు. నేడు మన ఇంటిని మాదిరిగా, మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలనే తపనతో పాటు మనకు సామాజిక బాధ్యత ఉండాలన్నారు. నేడు స్వచ్ఛ భారత్ పేరుతో ప్రధాని నరేంద్రమోదీ, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ పేరుతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో పర్యావరణం కాపాడుకోవడం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు.

ప్రస్తుతం ప్లాస్టిక్ క్యాన్సర్ కారణభూతంగా మారిందని, గతంలో మనం ఎక్కడో ఒక చోట క్యాన్సర్ అనే మాట వినేవాళ్లం.... కానీ నేడు చాలా మంది మనకు తెలిసిన వాళ్లే క్యాన్సర్ బారిన పడిన సందర్భాలు అనేకం చూస్తున్నామన్నారు. క్యాన్సర్ కు మూలమైన ప్లాస్టిక్ ను నిర్మూలించడం ద్వారా మన ఆరోగ్యాలను కాపాడుకోవచ్చుని మంత్రి స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ మన చుట్టూ పరిసరాలు, ప్రభుత్వ కార్యాలయాలు, రోడ్లు, ఆస్పత్రులు, కాల్వలు, అపరిశుభ్రంగా ఉంటే ప్రజలు ప్రభుత్వాలు, నాయకులు, అధికారుల వద్దకు వెళతారన్నారు. కానీ ఈ సమాజం మనది... మనమే ఎందుకు మన పరిసరాలను శుభ్రం చేసుకోకూడదనే ఆలోచన రావడం లేదు.. ఇది నా గ్రామం, నాది అనే మన ఆలోచనలో మార్పు రావడం ద్వారానే ప్లాస్టిక్ వంటి వాటిని ఈ సమాజం నుంచి తరిమిగొట్టగలమన్నారు. ఇలాంటి కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. బీసీ ఇందిరమ్మ చొరవ తీసుకుని ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లడం చాలా సంతోషకరం.. ప్లాస్టిక్ నివారణ, పారిశుద్ధ్య నివారణ వంటి కార్యక్రమాలు చేపట్టడం చెప్పినంత సులువు ఎంతమాత్రం కాదన్నారు. ఇది ప్రాక్టీకల్ గా చాలా కష్టంతో కూడుకున్నది.. సమాజంలో అందరినీ కలుపుకుని పోవాలి, అదే సమయంలో దీన్ని నిరంతరం ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేయాలన్నారు. అయితే ప్రతి ఒక్కరినీ ప్రేరేపించి, వారిలో ప్లాస్టిక్ పై అవగాహన కల్పించి వారిని చైతన్యపరచాలన్నా ఇందిరమ్మ గారి ఆలోచన చాలా గొప్పదన్నారు. ప్లాస్టిక్ వంటి వస్తువులను వాడి పారేసిన తర్వాత, వాటిని కాల్చినే, ఆ పొగను పీల్చడం ద్వారా లంగ్ క్యాన్సర్ వంటివి వచ్చే ప్రమాదం ఉందన్నారు. ప్లాస్టిక్ ద్వారా మన ఆరోగ్యాన్ని మనమే నాశనం చేసుకుంటున్నామని చిన్నారులు ప్రదర్శించిన స్కిట్ లు ఎంతో సందేశాన్ని ఇస్తున్నాయన్నారు. ప్లాస్టిక్ ను నివారించడంతో పాటు, పచ్చదనం పెంచాలన్న గొప్ప మెసేజ్ ఇవ్వడం గొప్ప నిర్ణయం అన్నారు.